
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 184 -

## అమెరికా యోగా కథ…మొదటి భాగం

**మా క్వీన్ విక్టోరియాకి** తెలియని రహస్యం ఒకటి ఉంది. ఒకటేమిటి లెండి. మొగుడూ, పెళ్ళాల మధ్య నిజానికి చాలానే చిన్నా, పెద్దా రహస్యాలు ఉంటాయి కానీ ఇక కాపరానికి ఏమీ డేంజర్ లేదు అని కచ్చితంగా అనిపించినప్పుడు వాటిల్లో కొన్ని ఏదో సరదాగా చెప్తున్నట్టు చెప్పేసి ఆ రహస్య భారం వదిలించుకుంటారు. ఇప్పుడు నాదీ అలాంటిదే కానీ ఇది మా పెళ్ళి కాక ముందు యవ్వారం కాబట్టి మరీ అంత రహస్యం కాదు కానీ ఇప్పటి దాకా ఆవిడ దగ్గర దాచిపెట్టినదే!. ఇది చిన్నపాటి చిన్న తనం రహస్యం అనుకోవచ్చును. విషయం ఏమిటంటే….నేను ఇంకా ఘోటక బ్రహ్మచారిగా నాలాంటి వాళ్లే నలుగురైదుగురు యూనివర్శిటీ ఆఫ్ హ్యూస్టన్ లో విద్యార్ధులతో తిరిగేటప్పుడు కొట్టొచ్చిన లోటు – అసలు ఈ డేటింగ్ అనే పదార్ధం అర్ధం తెలుసుకోవాలంటే మాలో ఎవరికీ అమెరికా అమ్మాయిలు తెలియక పోవడం. దాం దుంపతెగా….”అంత కసట పడి అమెరికా అమెరికా వొచ్చీసాక డేటింగ్ సెయ్యకపోతే అమెరికా రాలేని మా ఇసాపట్నం ఇస్సేస్స్వర్రావు గాడికి ఏటి రాసేది…డేటింగ్ సెయ్యలేదని ఆడికి తెలిస్తే యెదవా, నీకు అమెరికా ఎందుకు, యెనక్కొచ్చెయ్ గాజువాక సాలు నీకు అనెయ్యడూ…..” ఆడి కోసం యాభై ఏళ్ళ కితం ఏసిన ఏసాలనమాట…

ఇప్పుడైతే అమెరికా కాలేజీలలో అమెరికన్లు అరా కొరా గానూ, మన వాళ్ళు, చైనీయులూ సర్వత్రానూ కనపడతారు కానీ ఆ రోజుల్లో కేంపస్ లో మన పవిత్ర భారతీయులు అరా కొరా గానే ఉండేవారు. తెల్లారితే అందరూ తెల్లామెరికన్ ఆడంగులూ, మగంగుల తోటే జీవితం. మన గోధుమ రంగూ, నోరు విప్పితే రాలే వింగ్లీషు గింగ్లీషూ, తలకి కొబ్బరి నూనె వాసన బాపతు “మనోళ్ళ” ని ఆ అమెరికాడంగులు దూరంగా పెట్టేసి ‘వాళ్లోళ్ళ”ని మాత్రమే వాటేసుకుని తిరిగే వారు. మరి అమెరికా అమ్మాయిలతో మాట్లాడకుండా వాళ్ళ కల్చర్ మనకి ఎలా తెలుస్తుందీ, మన కల్చర్ లెక్చర్ ఎవరికి ఇవ్వాలీ అనే మా అందరి బెంగానూ. ఇది నిఝం..నిఝంగానే నిఝం. అమ్మాయిలతో తిరిగి కులాసా చెయ్యాలనే దురుద్దేశం ఏ

మాత్రం లేదు. నమ్మక పోతే మానెయ్యండి! కేవలం డేటింగ్ అనగానేమి అని తెలుసుకోడానికే మా తాపత్రయం... ఆ ఇస్సేస్వరావు గాడి కోసం యాభై ఏళ్ళ కితం ఏసిన ఏసాలనమాట...

అదిగో, అప్పుడు ఎవడో "గురూ. మనం యోగా క్లాస్ లకి వెళ్దాం. అక్కడ అమెరికా అమ్మాయిలు ఉంటారు"...ఆవురావురు మంటున్న వాడికి పులిహోర, పరమాన్నం వేసిన విస్తరాకు లాంటి ఈ అవిడియాకి ఎగిరి గెంతేసి. పేపర్లలో ప్రకటనలు వెతికి మొత్తానికి ఒకానొక 'హఠ యోగా"– మొదటి క్లాస్ ఉచితము" అనే చోటికి వెళ్ళాను. వెళ్ళగానే కళ్ళు తిరిగాయి. సదరు కళ్ళు తిరుగుట అదేదో అక్కడ అనేక మంది సుందరాంగులయిన అమ్మాయిలని వీక్షించి కాదు. "రెండవ క్లాస్ నుంచీ గంటకి యాభై డాలర్లు. నెలకి కనీసం 4 క్లాసులు ఉండవలెను" అని ఆ యోగా చెప్పే గెడ్డం కుర్రాడు చెప్పగానే కళ్ళు తిరిగాయి. ఆ రోజుల్లో నా నెలవారీ స్కాలర్ షిప్...అవును..నెలకి రెండు వందల డాలర్లు. అలా కేవలం అమ్మాయిల సౌందర్య వీక్షణ కోసం అలాంటి కోతి పని చెయ్యడం మా క్వీన్ విక్టోరియాకి ఎప్పుడూ చెప్పని రహస్యం.

ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే...మొన్నీ మధ్య ఎవరింటికో వెళ్ళినప్పుడు ఆ ఇంటాయన ఇవాళో, రేపో అన్నట్టు ఉండగానే నాకు అనుమానం వచ్చేసి "మీరు యోగా చేస్తారా?" అని అడిగేశాను. ఆయన పాపం అమాయకంగా "అవును సర్, నేను సర్టిఫైడ్ యోగా టీచర్ని. మహేష్ యోగి మెడిటేషన్, రామ్ దేవ్ శీర్షాసనం, గీం దేవ్ శవాసనం, మండూక, మయూర మొదలైన ఆసనాలు నేర్పుదును." అని తన బిజినెస్ కార్డ్ నా చేతిలో పెట్టాడు. ఎప్పుడో వివాహానికి ముందు ఏదో డేటింగ్ కి అమాయిలు దొరుకు ప్రదేశములలో ఒకటి అనుకుని భ్రమ పడి ఒకానొక దిక్కుమాలిన యోగా క్లాసుకు వెళ్ళిన నేను చేసిన పరిశోధన లో చాలా అంశాలు కనిపెట్టాను. ఆ రోజుల్లో బీటిల్స్, మహేష్ యోగి, జానీ కార్సన్ ల ధర్మమా అని హాలీవుడ్ తారలు ఎక్కువగా ఈ యోగా అనే దాన్ని ఏదో బ్రహ్మపదార్థం లాగా చెప్పేవారు కానీ మా హ్యూస్టన్ లో మూడు, నాలుగు చోట్ల మాత్రమే యోగా నేర్పే స్కూల్స్ ఉండేవి. ఇప్పుడు ప్రతీ వీధికీ ఒక్కొక్కటి...హఠ, అయ్యంగార్, కుండలిని, విన్యాస, పవర్, బిక్రమ్, అనుసర, అష్టాంగ, ప్రాణాయామ-----ఇక మా అమెరికన్లు ఎప్పటిలాగానే బాగా ముందడుగు వేసి నేకెడ్ యోగా, డాగ్ యోగా, బీర్ యోగా, ఎల్ జి బి టి యోగా....ఇక మోడీ గారి యోగం బావుండి ఐక్యరాజ్య సమితి వారు యోగా దినం అంటూ ప్రతీ ఏడూ ఒక తత్ దినం గా ప్రకటించగానే మన వాళ్ళు రెచ్చి పోయి. మైదానాల నిండా నిండి పోయి, సముద్రాల ఒడ్డున చతికిల పడి యోగావస్త్ర లోకి వెళ్ళి....యావత్ మానవాళికి మన యోగ పుంగవులు అందించిన ఆరోగ్య సూత్రాల గురించి అమెరిన్లు తెగ పొగిడేస్తున్నారు అని మనలో మనమే చెప్పుకుని....కాస్త ఒంట్లో బాగా లేక పోతే అమెరికన్ ఆసుపత్రికి వెళ్ళి మందులు తెచ్చుకుంటాం!. ఇక్కడ నాకు ఆశ్చర్యం కలిగించే అప్రస్తుత ప్రసంగం ఏమిటంటే...అమెరికా ఆసుపత్రులు అన్నింటిలోనూ ఎందుకైనా మంచిది అని కాబోసు.,,ఒక ప్రార్థనా మందిరం ఉంటుంది..కానీ యోగా మందిరం ఉండదే1. మన భారత దేశం లో

అయితే మామూలు ఆసుపత్రులలో ప్రార్ధనా మందిరం మాట దేవుడెరుగు....రోగులకి మంచాలే ఉండవు. మందులు అంతకన్నా ఉండవు.

ఇక నా యోగా పరిశోధన లో తెలిసిన మరొక విశేషం ఏమిటంటే.....అమెరికా లో కేవలం తెల్ల అమెరికన్ వారే యోగా చేయుదురు. ఆఫ్రికన్ అమెరికన్లు ఏమి చేయుదురో నాకు తెలియదు కానీ వాళ్ళు లో యోగా చేసే ఆడంగులు కానీ మగంగులు కానీ నాకు కనపడ లేదు. కనపడినా అదేదో ఫిగర్ బావుంటుంది అని పోజు కొట్టడడమే కానీ యోగా చేసేసి ఉద్ధరిస్తున్న బాపతు కాదు. ఇక మెక్సికన్, చైనీస్, జపనీస్ వగైరా లు మచ్చుకి ఒక్కరైనా యోగా చుట్టుపక్కలకి వెళ్ళడం నేను చూడలేదు. మరి వాళ్ళకి మోడీ అంటే పడదో...లేక వాళ్ళకి కంగ్ ఫూ, కరాటే....లాంటి ఒరిజినల్ ఒళ్ళు విరుపులూ, అరుపులూ ఉన్నాయి కాబట్టి ఈ యోగం పట్టదో మరి తెలియదు. అన్నట్టు యోగా చేస్తున్నప్పుడు చైనా వాళ్ళ కరాటే లో లాగా ఆంఫట్, కుయ్, కయ్, నుయ్ అని అరడానికి యోగా రూల్స్ ఒప్పుకోవు. అంతా నిశ్శబ్దంగా కేవలం ఎముకలు విరిగిన చప్పుడు లేదా ఊపిరి ఘాటిగా పీల్చిన చప్పుడు మాత్రమే అంగీకరించబడును. మరొక పరిశీలన ప్రకారం....నాలాగా చిన్న బొండాం, నాలాగ కాకుండా కాస్త పెద్ద బొండాం ల స్థూల కాయులమైన మేము కింద చాప మీద కూర్చునుటయే కాని లేవలేక పోవుట వలన ఏమియో కానీ మేము యోగా టీచర్లు గా అనర్హులం. అంచేత ఈ యోగా చెప్పేవాళ్ళు అందరూ ...అవును.....నీరసంగా, గట్టిగా ఊదితే గాలిలో ఎగిరిపోయేలా....సన్నగా, రివటల్లా ...కండబలం అస్సలు లేకుండా.. ఎందుకుంటారో నాకైతే తెలీదు. అది ఫేషనో, ఆరోగ్యానికి సూచనో అంతకన్నా తెలీదు..

అసలు ఈ తాత్కాలిక శరీరాన్ని అష్టవంకరలూ తిప్పేసి అది ఆరోగ్యానికి అత్యవసరం అనే ఈ యోగాసనాల మీద అసలు ఏ విధమైన అభిప్రాయలూ లేకపోయినా మా అనుభవాల మీద మరొక హాస్య కౌముది......మరొక సారి..

**COMMENTS**